




# వనంలో వైభవం...
# మేడారం మొదటిరోజే హోరు

- మహాజాతర భక్తజన సంద్రంగా మారింది
- సారలమ్మ గద్దెపైకి చేరిన కీలక ఘట్టం
- కన్నెపెల్లి నుంచి మేడారానికి బిడ్డ దేవత పయనం
- డోలు వాయిద్యాలతో ఘనంగా ఊరేగింపు
- లక్షలాది భక్తులతో కిక్కిరిసిన అడవి ప్రాంతం
- 30 కిలోమీటర్ల పరిధిలో భక్తుల రద్దీ
- రాత్రి 8 గంటలకు సమ్మక్క గుడికి సారలమ్మ చేరిక
- పగిడిద్దరాజు పయనంతో పులకించిన భక్తులు
- దారిపోడవున మొక్కులు, నీరాజనాలు వెల్లువ
- మంత్రి సీతక్క మొక్కులు సమర్పణ
- పూణకాలతో హోరెత్తిన జాతర పరిసరాలు
- పస్రా నుంచి మేడారం వరకు రోడ్లన్నీ కిక్కిరిసిన దృశ్యం
- దేవతల రాకతో భక్తుల్లో ఉత్సాహం వెల్లువెత్తింది





**ఏటూరునాగారం (క్రైం), జనవరి 28 (డిడి9 వార్త):**

మేడారం మహాజాతర భక్తజన సంద్రంగా మారింది. మహఘట్టం ప్రారంభ దశలోనే లక్షలాది మంది భక్తులు తరలివచ్చి అడవి ప్రాంతాన్ని కిటకిటలాడించారు.

ఇటు తాడ్వాయి నుంచి మేడారం వరకు... కొండాయి నుంచి మేడారం దాకా...పస్రా సమీపంలోని టప్పమంచ వరకు... కాల్వపెల్లి, బయక్కపేట, కన్నె పెల్లి ప్రాంతాల అడవులు భక్తుల విడిది కేంద్రాలుగా మారాయి.

మేడారం జాతరలో ఎక్కడ చూసినా భక్తుల రద్దీతో గాలి ఆడనివిధంగా మారింది. ఊపిరి సల్పడానికి కూడా చోటులేని పరిస్థితి నెలకొంది.

**సారలమ్మ పయనం...**
**భక్తుల పులకింత**

సారలమ్మను కన్నెపెల్లి గుడి నుంచి ప్రధాన పూజారి కాకసారయ్య ఆధ్వర్యంలో గ్రామస్తులు, పూజారులు, అధికారులు డోలు వాయిద్యాలతో ఊరేగింపుగా మేడారానికి తరలించారు.

రాత్రి 6:30 గంటలకు పయనం ప్రారంభమైన సారలమ్మ వాగు దాటి లక్షలాది భక్తజనాన్ని దీవిస్తూ మేడారంలోని తల్లి సమ్మక్క గుడికి రాత్రి 8 గంటలకు చేరుకుంది.

సమ్మక్క పూజారులు ఘనంగా ఎదుర్కొని సారలమ్మను గుడిలోకి తల్లి చెంతకు చేర్చారు.

ఈ కీలక ఘట్టం జాతర మొదటిరోజే ఉత్సవ వాతావరణాన్ని మరింత ఉద్ధృతం చేసింది.

**పగిడిద్దరాజు పయనంతో పులకించిన జనం...!!**

సమ్మక్క భర్త పగిడిద్దరాజు మేడారానికి పయనమై రావడంతో దారిపోడవున భక్తులు పసుపు, కుంకుమ, బంగారం, ఒడిబియ్యం సమర్పిస్తూ మొక్కులు చెల్లించారు.

లక్షలాది భక్తులు ఈ ఘట్టాన్ని తిలకిస్తూ పులకించిపోయారు.

పెనకవంశస్తులు, యువకులు, పోలీసులు పటిష్ట భద్రతతో ఏర్పాట్లు చేపట్టారు.

పూనుగొండ్ల నుంచి పయనమైన పగిడిద్దరాజును మధ్యాహ్నం గోవిందరావుపేట మండలం లక్ష్మీపురంలో విడిది చేశారు. సాయంత్రం 4:30 గంటలకు తిరిగి బయలుదేరిన బృందం రాత్రికి మేడారం చేరుకోనుంది.

రోడ్డుపోడవున భక్తుల రద్దీతో రహదారులు కిక్కిరిశాయి.

**పగిడిద్దరాజుకు మంత్రి సీతక్క మొక్కులు...!!**

పగిడిద్దరాజుకు మంత్రి సీతక్క మొక్కులు సమర్పించారు.

పగిడిద్దరాజు పూజారులు సీతక్కకు ఆడబిడ్డ బట్టలు, చీరె, సారె, పసుపు, కుంకుమలు సమర్పించారు.

పెనకవంశస్తులు పూజలతో సీతక్క హర్షం వ్యక్తం చేశారు. లక్ష్మీపురం గ్రామమంతా పండుగ వాతావరణంతో కళకళలాడింది.

అక్కడి నుంచి మేడారం సమీపంలోని పడిగాపురం-ఎలుబాక ప్రాంతాలకు చేరుకున్న సీతక్కకు ఘన స్వాగతం పలికారు. అనంతరం గుడిలో మొక్కుబడులు చెల్లించారు.

**పూణకాలతో హోరెత్తిన జాతర పరిసరాలు...!!**

మేడారం మహాజాతరకు వచ్చిన లక్షలాది భక్తులు దేవతల రాకతో పులకించిపోయారు. అడవుల్లో విడిది చేసిన భక్తజనం పూణకాలతో హోరెత్తిపోయారు. పగిడిద్దరాజు రాకతో పస్రా నుంచి నార్లాపురం-చింతలక్రాస్ వరకు...

గోవిందరాజు రాకతో కొండాయి నుంచి ఊరట్టం-కొత్తూరు-మేడారం వరకు...

సారలమ్మ రాకతో కన్నెపెల్లి నుంచి మేడారం వరకు...

భక్తులు నీరాజనాలు పలుకుతూ ఎదురుచూశారు.